అనాథ ఆశ్రమంలో పండ్ల పంపిణీ



పండ్లు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: టీపీసీసీ చీఫ్ బొమ్మ మహేష్ కుమార్‌గౌడ్ జన్మదినాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. కుత్బుల్లాపూర్ బ్లాక్ అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్ ఆధ్వర్యంలో శ్రీకృష్ణ నగర్ ఇంటిగ్రేటెడ్ వెల్ఫేర్ సొసైటీ, సాయి సహకార్ అనాథ ఆశ్రమాల్లో జరిగిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ హాజరై పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బాలప్ప, నర్సింహారావు, బండి సాయిగౌడ్, పూర్ణచందర్, మురళి, వీరబాబు, బుచ్చిరెడ్డి, మోతే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పార్క్ చేసిన బైక్ చోరీ

సనత్‌నగర్: ఇంటి ముందు పార్క్ చేసిన కేటీఎం బైక్ చోరీకి గురైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది.. పోలీసులు తెలిపిన మేరకు.. భరత్‌నగర్‌కు చెందిన జిమ్ ట్రైనర్ అట్ల బాల గోపీకృష్ణారెడ్డి (27) తన కేటీఎం బైక్‌ను ఈ నెల 22న రాత్రి ఇంటి ముందు పార్క్ చేశాడు. మరుసటి రోజు ఉదయం చూడగా బైక్ కనిపించలేదు. చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ప్రయోజనం లేకపోయింది. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఇద్దరి అరెస్టు

సనత్‌నగర్: గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని బేగంపేట పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. వారి వద్ద నుంచి 130 గ్రాముల గంజాయి, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన మేరకు.. బేగంపేట రసూల్‌పురా ఇందిరమ్మ నగర్ బీరప్ప ఆలయ సమీపంలోని ఓ ఇంట్లో గంజాయి అమ్ముతున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఆ ఇంటిపై దాడులు నిర్వహించారు. రసూల్‌పురా ఇందిరమ్మనగర్ ఇలాహి మసీదు దగ్గర ఉండే ఆటోడ్రైవర్ చెట్క్యారి వేణు (21), కూలీ పనిచేసే బోయిన్‌పల్లి హస్మతపేటకు చెందిన గుర్రాల మధుసూదన్ (19) గంజాయి విక్రయిస్తున్నట్లుగా గుర్తించారు. వీరు రసూల్‌పురా మీ–సేవా సమీపంలో ఉండే డ్రైవర్ కొరెట్ల నరేష్ (22) వద్ద కొనుగోలు చేసి విక్రయిస్తున్నట్లుగా పోలీసుల విచారణలో తేలింది. అయితే కొరెట్ల నరేష్ పరారీలో ఉన్నాడు. చెట్క్యారి వేణు, గుర్రాల మధుసూదన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. పరారీలో ఉన్న నరేష్ కోసం గాలింపు చేపట్టారు. బేగంపేట పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇళ్ల మధ్యలో మురుగు!

సుభాష్‌నగర్: జనావాసాల మధ్య మురుగు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని అధికారుల చుట్టూ మూడు నెలలుగా తిరుగుతున్నా సంబంధిత అధికారులు అటు వైపు చూసిన పాపన పోలేదని ఆ బస్తీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొంపల్లి మున్సిపల్ దూలపల్లి లోని 18వ వార్డు ఓ రోడ్డులో డ్రైనేజీ జనావాసాల మధ్య రోడ్డులో నిత్యం నిలిచిపోతుంది. దీనివల్ల ఈగలు, దోమలు వృద్ధి చెంది స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. గతంలో ఈ విషయమై స్థానికులు అధికారుల దృష్టికి తీసుకెళ్లగా.. భూగర్భ డ్రైనేజీ నిమిత్తం రూ. 25 లక్షలు మంజూరు చేశారు. కానీ మూడు నెలలు గడుస్తున్నా అధికారులు పనిచేసిన పాపాన పోలేదు. దీంతో నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని స్థానికులు పేర్కొంటున్నారు. రోడ్డుపై మురుగు నిలిచిపోవడం వల్ల చుట్టూ తిరిగి వెళ్లాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు దృష్టి సారించి పనులను తక్షణమే ప్రారంభించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



దూలపల్లి 18వ వార్డులో ఇళ్ల మధ్యలో నిలిచిన నీరు

వివాదాలకు కేరాఫ్ జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్!

- ఫిర్యాదు చేస్తే ఇరువర్గాల నుంచి వసూళ్లు
- గతంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సస్పెన్షన్
- తాజాగా ఏసీబీకి చిక్కిన ఎస్‌ఐ

ఒకవైపు ఫ్రెండ్లీ పోలీసింగ్ అంటూ ఉన్నత అధికారులు ప్రజలకు చేరువయ్యేందుకు ప్రయత్నం చేస్తుండగా... లంచగొండి తనానికి అలవాటుపడ్డ మరికొందరు పోలీసులు లక్ష్యానికి తూట్లు పొడుస్తున్నారు. ఇప్పటికే వివాదాలకు కేరాఫ్ అడ్రస్‌గా ఉన్న జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌లో ప్రతి కేసు విషయంపై ఇరు వర్గాల వారి నుంచి డబ్బులు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.



కుత్బుల్లాపూర్: అత్యధిక మురికివాడ ప్రాంతాలు ఉండటం, అందులో ప్రభుత్వ స్థలాలు, అక్కడ చేపట్టే నిర్మాణాల విషయంపై పోలీసులు అతి జోక్యం వల్ల ఈ పోలీస్ స్టేషన్ ఎప్పుడు చర్చల్లోనే ఉంటుంది. గతంలో ఇక్కడ పని చేసి సస్పెండ్‌కు గురైన ఓ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కూడా డబ్బులకు కక్కుర్తిపడి ప్రజలను వేధిస్తున్న విషయంపై అప్పట్లో 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. అధికారులు విచారణ జరిపి సస్పెండ్ చేశారు. తాజాగా బ్యాండ్ సామాను తిరిగి ఇచ్చే విషయంలో రూ.15 వేలు లంచం తీసుకుంటూ ఎస్‌ఐ శంకర్‌తో పాటు మరో వ్యక్తిని ఏసీబీ అధికారులు పట్టుకోవడంతో మరోసారి ఈ పోలీస్ స్టేషన్ వార్తల్లోకి ఎక్కింది. 2015లో జీడిమెట్ల పోలీస్ స్టేషన్ నుంచి కొంత భాగం తీసి జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్‌గా చేశారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహించిన అధికారులు ఏదో ఒక ఆరోపణతో ఉన్నత అధికారుల ఆగ్రహానికి గురవుతున్నారు.

సెటిల్మెంట్లు, బెదిరింపులే లక్ష్యంగా..

ఏదైనా కేసు పోలీస్ స్టేషన్‌కు వచ్చిందంటే చాలు ఇక్కడ కొంతమంది ఎస్‌ఐలు రాజీ కుదుర్చడం.. ఇరుపక్షాల నుంచి డబ్బులు వసూలు చేయడమే పనిగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది. ఇటీవల ఓ గంజాయి ముఠాను పోలీసులు పట్టుకొని అందులో ఓ వ్యక్తిని తప్పించే విషయంలో పెద్ద మొత్తంలో డబ్బులు తీసుకున్నట్లు సమాచారం. ఇదే తరహాలో ప్రభుత్వ స్థలాల్లో చేపడుతున్న అక్రమ నిర్మాణాల విషయంపై రెవెన్యూ అధికారులు ఫిర్యాదు చేయకముందే పెట్రోలింగ్ వాహనం సిబ్బంది స్థానికంగా ఉండే సెక్టార్ ఎస్‌ఐలను అప్రమత్తం చేస్తారు. వారిని స్టేషన్‌కు తీసుకువచ్చి డబ్బులు వసూలు చేసి తిరిగి వదిలిపెడుతున్నట్లు తెలిసింది. ఇలా అనేక విషయాల్లో కొంతమంది ఎస్‌ఐలు సెటిల్‌మెంట్లు చేస్తూ బెదిరింపులకు పాల్పడుతున్నారని బహిరంగంగా పలువురు ఆరోపణలు చేయడం విశేషం.

పై ఆఫీసర్లు తెలుసు.. వచ్చి కలవండి..

జగద్గిరిగుట్ట పోలీస్ స్టేషన్ పరిధిలో ఉండే దేవేందర్ నగర్, కైసర్ నగర్, రావి నారాయణరెడ్డి నగర్, బాలయ్య నగర్ తదితర ప్రాంతాల్లో ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపట్టిన విషయంపై గతంలో రెవెన్యూ అధికారుల ఫిర్యాదు మేరకు పలువురి పై రౌడీషీట్ తెరిచారు. అంత వరకు బాగానే ఉంది. తర్వాత ఈ ప్రాంతంలో భూ కబ్జాదారులుగా చలామణి అవుతున్న వారిని గుర్తించి ఓ ఎస్‌ఐ 'పై అధికారులు నాకు తెలుసు.. పలుకుబడి ఉంది.. నన్ను వచ్చి కలవకుంటే మీపై కేసులు నమోదు చేస్తాను' అని బెదిరించి అందిన కాడికి దండుకున్నట్లు ప్రధాన ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ విషయంపై ఉన్నత అధికారులు దృష్టి సారిస్తే తప్పకుండా సదరు ఎస్‌ఐ చేస్తున్న అరాచకాలు వెలుగులోకి వస్తాయని అంటున్నారు. చిన్న కేసు మొదలుకొని వివాదాస్పద ప్రభుత్వ స్థలాల విషయంపై కూడా జోక్యం చేసుకొని డబ్బులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని, డబ్బులు ఇవ్వకుంటే ఏకపక్షంగా వ్యవహరిస్తూ మరో వర్గానికి సహకరిస్తూ ముప్పతిప్పలు పెడుతున్నట్లు పలువురు చర్చించుకుంటున్నారు. అదేవిధంగా పోలీస్ స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల సముదాయాల్లో అర్ధరాత్రి వరకు బ్లాక్ అడ్డాలో మద్యం అమ్ముతున్నారు. కట్టడి చేసే విషయంలో సైతం నెలవారి మామూళ్లకు అవాటుపడ్డట్లు స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు కిందిస్థాయి అధికారులు, సిబ్బందిపై దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

ఆపరేషన్ సిందూర్‌తో తగిన గుణపాఠం

ఎంపీ ఈటల రాజేందర్



తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎంపీ ఈటల రాజేందర్

రంగారెడ్డినగర్: ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్‌కు సైన్యం తగిన గుణపాఠం చెప్పిందని ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. శనివారం కుత్బుల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్ నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు కొనసాగిన తిరంగా ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. పార్టీలకు అతీతంగా ర్యాలీలో పాల్గొన్న వారు జాతీయ జెండాలను పట్టుకుని భారత్ మాతాజీ జై అంటూ నినదించారు. అనంతరం ఎంపీ మాట్లాడుతూ.. ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని, పహల్గామ్ ఉగ్రదాడికి పాల్పడిన ముష్కరులను భారతదేశ సైన్యం భీకరమైన దాడులతో అంతమొందించిందని అన్నారు. నేడు మన దేశం అన్ని రంగాల్లో శక్తివంతంగా రూపుదిద్దుకుందన్నారు. త్రివిధ దళాలు ఎంతో ధైర్య సాహసాలు ప్రదర్శించి ఉగ్రస్థావరాలను తునాతునకాలు చేశాయన్నారు. .

ర్యాలీకి తరలిన నేతలు

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ మున్సిపాలిటీ కార్యాలయం నుంచి ఐడీపీఎల్ చౌరస్తా వరకు తిరంగార్యాలీ నిర్వహించారు. ర్యాలీకి నాయకులు తరలివచ్చారు. ఈ సందర్భంగా బీజేపీ కొంపల్లి మున్సిపల్ అధ్యక్షుడు సతీష్‌సాగర్ మాట్లాడుతూ.. ఆపరేషన్ సిందూర్‌తో పాకిస్తాన్ తోక ముడిచిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజిరెడ్డి, జిల్లా కౌన్సిల్ సభ్యులు జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర మహిళా మోర్చ నాయకులు సరిత రావు, అసెంబ్లీ కోకన్వీనర్ శివాజీ రాజు, జిల్లా నాయకులు జీవన్ రెడ్డి, దుర్గా అశోక్, శంకర్ నాయక్, కొంపల్లి పట్టణ నాయకులు మధు, శ్రీనివాస్, మాధురి, నర్సింగ్ రావ్, మహేందర్, ప్రకాష్ రావు, శివాజీ తదితరులు పాల్గొన్నారు.



టెంట్‌హౌస్‌లో అగ్ని ప్రమాదం

జీడిమెట్ల: దూలపల్లిలోని ఓ టెంట్‌హౌస్‌లో అగ్నిప్రమాదం జరిగింది. విషయం తెలుసుకున్న జీడిమెట్ల ఫైర్‌సిబ్బంది వెంటనే చేరుకుని మంటలను అదుపుచేశారు. అగ్నిమాపక అధికారి శేఖర్‌రెడ్డి వివరాల ప్రకారం.. దూలపల్లిలో రవీందర్ యాదవ్ అనే వ్యక్తి సిందూ టెంట్‌హౌజ్ నిర్వహిస్తున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి తర్వాత టెంట్‌హౌస్‌లో మంటలు వచ్చాయి. గమనించిన స్థానికులు అగ్నిమాపక కేంద్రానికి సమాచారం అందించారు. వెంటనే అక్కడకు చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను ఆర్పివేశారు. అప్పటికే కొంత మేరకు టెంట్‌హౌస్ సామానులు కాలిపోయాయి. షార్ట్ సర్క్యూట్ వల్ల అగ్నిప్రమాదం జరిగిందని అగ్నిమాపక అధికారి తెలిపారు.

ప్రత్యేక పూజలు



జగద్గిరిగుట్ట: చింతల్, శ్రీసాయి కాలనీలో అభయ ఆంజనేయ, పోచమ్మ అమ్మవారి ఆలయంలో శనివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. హనుమాన్ అన్నప్రసాద సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. కార్యక్రమానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

వీర జవాన్‌లకు ఘన నివాళి

జీడిమెట్ల: పాకిస్తాన్‌తో జరిగిన యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులు చరిత్రలో భరతమాత ముద్దు బిడ్డలుగా మిగిలిపోతారని బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా అధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి అన్నారు. శనివారం సుభాష్‌నగర్‌లో రాష్ట్ర మాజీ కార్యవర్గ సభ్యులు ఎం.ఎస్.వాసు ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. వీర జవానుల చిత్రపటం వద్ద నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఇండస్ట్రియల్ కన్వీనర్ గిరిబాబు, కౌన్సిల్ సభ్యుడు కంది శ్రీరాములు, కల్యాణి శ్రీనివాస్, చిన్నస్వామి, శేషబాబు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

ధ్రువీకరణ పత్రాల కోసం తిప్పలు!

- విద్యాసంస్థల్లో ప్రవేశాలకు సర్టిఫికెట్లు తప్పనిసరి
- కుల, ఆదాయ, ఓబీసీ ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం
- మీ–సేవా కేంద్రాలు, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలు
- గ్రేటర్‌తోసహా శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లో 58 మండలాలు

సాక్షి,సిటీబ్యూరో: విద్యార్థులకు అవసరమైన ధ్రువీకరణ పత్రాల జారీలో పారదర్శకత లోపిస్తోంది. విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందే సమయం కావడంతో సర్టిఫికెట్ల కోసం మీ–సేవా కేంద్రాలు, తహసీల్ కార్యాలయాల చుట్టూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ప్రదక్షిణలు చేస్తున్నారు. గ్రేటర్‌తో సహా శివారులో మొత్తంగా (హైదరాబాద్ జిల్లాలో 16, మేడ్చల్‌–మల్కాజిగిరి జిల్లాలో 15, రంగారెడ్డి జిల్లాలో 27) 58 మండలాలు ఉన్నాయి. ఇందులో కొన్ని మండలాల్లో ఈ ప్రక్రియ సజావుగా సాగుతుంటే.. మరికొన్ని చోట్ల నిబంధనల పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నిరాకరణ..

గ్రేటర్‌తో సహా శివారులోని పలు మండలాల్లో ఫ్యామిలీ మెంబర్ (కుటుంబ సభ్యుల) ధ్రువీకరణ పత్రాలను తహసీల్దార్లు జారీ చేయడం లేదు. కొన్నిచోట్ల మాత్రం మాన్యువల్‌గా ఇస్తున్నారు. అయితే ఇవి అన్ని చోట్ల చెల్లడం లేదు. ఫ్యామిలీ మెంబర్ ధ్రువీకరణ పత్రాలతో న్యాయస్థానాల్లో కేసులు వేస్తున్నారనే కారణంగా వీటి జారీకి రెవెన్యూ అధికారులు విముఖత వ్యక్తం చేస్తున్నట్లు తెలుస్తోంది.

ముందే చేయించాలట..

కుల, ఆదాయ, నివాస, ఓబీసీ తదితర ధ్రువీకరణపత్రాల జారీ కోసం మీ- సేవా కేంద్రాలకు వెళ్లి దరఖాస్తు చేస్తే కొందరు నిర్వాహకులు నేరుగా తీసుకోవడం లేదు. ముందుగా సదరు ఫారాలపై ఆర్‌ఐతో సంతకం తీసుకుని రావాలంటూ సూచిస్తున్నారని విద్యార్థులు వాపోతున్నారు. దీంతో చేసేదేమి లేక సదరు అధికారి కోసం తహసీల్ కార్యాలయాల వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందంటున్నారు. సంతకం పూర్తయ్యాక మళ్లీ మీ–సేవాకు వెళ్లి దరఖాస్తు చేసి, తిరిగి సదరు ఫారాలను తహసీల్దార్ కార్యాలయంలో అందజేస్తున్నారు. వాస్తవంగా ధ్రువీకరణ పత్రాల కోసం ఎక్కడైనా మీ- సేవాలో దరఖాస్తు చేసుకోవచ్చు. సదరు ఫారాలపై ముందస్తుగా ఏ అధికారి సంతకం అవసరం లేదు. ప్రక్రియ పూర్తయ్యాక సదరు ఫారాలను తహసీల్దార్ కార్యాలయంలో అప్పగించాల్సిన బాధ్యత కూడా మీ–సేవా కేంద్రాల నిర్వాహకులే చేయాల్సి ఉంటుంది.

అన్నీ తామై..

మీ–సేవా నుంచి వెళ్లిన దరఖాస్తులను ఆర్‌ఐ, తహసీల్దార్ లాగిన్లలో ఓకే చేసిన తర్వాతే ఆపరేటర్ ఓకే చేయాలి. కానీ సదరు అధికారులు పనుల్లో తీరిక లేకుండా ఉండడంతో వాటిని ఆపరేటర్లకు అప్పగిస్తున్నారు. ఇది వారికి కలిసి వస్తోంది. అన్నీ తామై నడిపిస్తున్నారు.

పాత ధ్రువీకరణ పత్రాలు ..

నూతన ధ్రువీకరణ పత్రాల జారీలో కొందరు తహసీల్దార్లు పాత సర్టిఫికెట్లు జత చేయాలని పేర్కొంటున్నారు. ఉదాహరణకు కుల ధ్రువీకరణ పత్రం కావాలంటే పాతది జత చేయాలని సూచిస్తున్నారు. అది లేకుంటే కుటుంబంలో ఎవరిదైనా తీసుకురమ్మంటున్నారు. లేకుంటే కొత్తవి ఇవ్వడం లేదు. నిబంధనల ప్రకారం ఏ పాత ధ్రువీకరణ పత్రాలు జత చేయాల్సిన అవసరం లేదు.

వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించొద్దు

బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వివేకానంద్, పాల్గొన్న అధికారులు

నిజాంపేట్: మౌలిక వసతుల కల్పనలో అధికారులు నిర్లక్ష్యం వహించరాదని బీఆర్‌ఎస్ విప్, ఎమ్మెల్యే కేపీ వివేకానంద అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఎమ్మెల్యే అధ్యక్షతన కార్పొరేషన్ పరిధిలోని అభివృద్ధి పనుల పురోగతిపై వివిధ అధికారులతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిజాంపేట్ కార్పొరేషన్‌లోని పలు డివిజన్‌లలో జరుగుతున్న అభివృద్ధి పనులపై ఇప్పటికే పలుమార్లు ప్రత్యేకంగా క్షేత్రస్థాయిలో పర్యటించామని తెలిపారు. ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు కృషి చేయాలన్నారు. సమావేశంలో నిజాంపే కార్పొరేషన్ కమిషనర్ సాబేర్ అలీ, డిప్యూటీ ఎమ్మార్వో, వాటర్ వర్క్స్, విద్యుత్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల పెంపునకు కలిసి పని చేద్దాం

కుత్బుల్లాపూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల పెంపునకు అందరం కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. కొంపల్లి మున్సిపాలిటీ పరిధి జిల్లా పరిషత్ ఉన్నత ప్రభుత్వ పాఠశాలలో ఐదు రోజులుగా నిర్వహిస్తున్న వృత్యంతర శిక్షణ కార్యక్రమానికి హాజరై మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో దుండిగల్ ఎంఈఓ కృష్ణ, మండల్ రిసోర్స్ పర్సన్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గిరి ప్రసాద్ సేవలు మరువలేనివి

సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం



చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

జగద్గిరిగుట్ట: నల్లమల్ల గిరి ప్రసాద్ సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఏసురత్నం అన్నారు. జగద్గిరిగుట్ట సీపీఐ ఆఫీస్ వద్ద శాఖ కార్యదర్శి ఎం సహదేవరెడ్డి అధ్యక్షతన గిరి ప్రసాద్ 29వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిప్రసాద్ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరీ విముక్తి కోసం పోరాటం చేశారన్నారు. ఇలాంటి మహనీయుల వర్ధంతిని ప్రభుత్వమే నిర్వహించాలని, పాఠ్య పుస్తకాల్లో చరిత్రను ప్రచురించాలన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా పేదల పక్షాన నిలబడేది కమ్యూనిస్టులు ఒక్కరేనని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్, కుత్బుల్లాపూర్ మండల కార్యదర్శి స్వామి, నాయకులు చిగురు వెంకటేష్, హరినాథరావు, రాములు, ఆవుల కృష్ణ, నరసింహారెడ్డి, జానకి రాములు, నారాయణ గౌడ్, శంకర్, జంబు, ఇమామ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత



లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న హన్మంత్‌రెడ్డి

నిజాంపేట్: ముఖ్యమంత్రి సహాయనిధి నిరుపేదలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పిస్తుందని కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి అన్నారు. శనివారం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బాచుపల్లి పార్టీ కార్యాలయంలో బోదాస్ గుట్టయ్యకు రూ.60 వేలు, ప్రగతినగర్‌కు చెందిన పోసాని సీత కల్యాణికి రూ.60 వేలు, కుత్బుల్లాపూర్‌కు చెందిన నార్లకంటి కృష్ణకు రూ.60 వేలు, చింతల్‌కు చెందిన దార శాంతిస్వరూప్‌కు రూ.60 వేలు, జీడిమెట్లకు చెందిన ఇందుర్తి రఘుపతిరావుకు రూ.60 వేలు, కుత్బుల్లాపూర్‌కు చెందిన కావడి భాగ్యలక్ష్మికి రూ.47 వేలు, సురారానికి చెందిన కె.సాయమ్మకు రూ.60 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు



స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ సాబేర్ అలీ

నిజాంపేట్: ఆయా కాలనీల్లో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని కమిషనర్ సాబేర్ అలీ అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్‌లోని 13, 14 డివిజన్‌లలో శనివారం పర్యటించి సమస్యలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తన దృష్టికి వచ్చే ప్రతీ సమస్యను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డితో, మున్సిపల్ సిబ్బంది కుమార్ యాదవ్, శ్రీశైలం యాదవ్, కాంగ్రెస్ ఎస్ఎంసీ మహిళా అధ్యక్షురాలు ఇందిరా, లింగాల గంగాధర్, మామిళ్లపల్లి శ్రీనివాస్, కృష్ణంరాజు, వర్మరాజు, శ్రీదేవి, వంగా శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

రంగారెడ్డినగర్: అభివృద్ధి పనులపై పర్యవేక్షణ కొరవడంతో కాంట్రాక్టర్లు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పనులు చేపట్టి అసంపూర్తిగా వదిలేయడంతో ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. జలమండలి ఆధ్వర్యంలో టీఎస్ఐఐసీ కాలనీలో తాగునీటి పైపులైన్ పనులు చేపట్టి పూర్తి చేశారు. అయితే రోడ్డు నెంబరు 16లో మ్యాన్‌వాల్వ్ వద్ద కుండీని నిర్మించేందుకు తీసిన గోతులను అలాగే వదిలేశారు. 15 రోజులుగా పనులు చేపట్టక పోవడంతో రాత్రి వేళల్లో వాటిని గుర్తించక వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇళ్ల ముందు ఆడుకునే చిన్నారులు ఎక్కడ గోతిలో పడతారో అని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు స్పందించి మ్యాన్‌వాల్వ్ కుండీని త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



నత్తనడకన పైపులైన్ పనులు

రోడ్డుపై భారీ గుంతతో ప్రమాదాలు

సుభాష్‌నగర్: సూరారంలోని నీటి శుద్ధి కేంద్రం (ఎస్‌టీపీ ప్లాంట్) పనులు కొన్ని నెలలుగా నత్త నడకన నడుస్తున్నాయి. పైపులైన్ నిమిత్తం ప్రధాన రోడ్డును తవ్వడంతో ప్రమాదాలకు నిలయంగా మారింది. సూరారం విలేజ్ విశ్వకర్మ కాలనీలోని మహబూబ్‌కుంట నుంచి రామారం పెద్ద చెరువు వరకు నీటి శుద్ధి కేంద్రం రెండు సంవత్సరాల క్రితం ప్రారంభించింది. ఇందులో భాగంగా సూరారం లక్ష్మీ నగర్ ప్రధాన రోడ్డును పైపులైన్ నిమిత్తం తవ్వారు. గతంలో ఎన్నికలు రావడం వల్ల మధ్యలో పనులను నిలిపివేశారు. తదనంతరం సదరు కాంట్రాక్టర్ కొన్ని నెలలపాటు అలాగే వదిలేశారు. ఇటీవల పనులు చేయించాడు. పెద్ద గొయ్యి ఉండటంతో తరచూ వాహనదారులు అందులో పడి ప్రమాదాల బారిన పడుతున్నారు. దీనికి తోడుగా నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుంది. తాజాగా శుక్రవారం రాత్రి పటాన్ చెరువుకు చెందిన ఓ యువకుడు ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా వెనకాల నుంచి ఓ ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొంటూ వెళ్లిపోయింది. దీంతో యువకుడి ఎడమ చేయి నుజ్జునుజ్జైంది. స్థానికులు గమనించి ఆసుపత్రికి తరలించారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు పర్యవేక్షించి పనులను పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పైపులైన్ నిమిత్తం రోడ్డుపై తీసిన గొయ్యి